

# ప్రాయశ్చిత్త

## శ్రీ గాలి బాలసుందరరావు

పెళ్లినాటికి శేషాచలం యఫ్. యే చదువుతూవుండే వాడు. అప్పటికే అతనికి సౌందర్య పిపాస, భావకవిత్వం, సమష్టివాదం, ఆడపిల్లలతో సహవాసం అవీయివీ యేమిటి, యిరవయ్యో శతాబ్దం యువకుడికి విధిగా పుట్టే బుద్ధులన్నీ పుట్టినయి. ఈ స్థితిలో అతని మేనగోడలు కాంతమ్మకూ అతనికీ ముడిబడిపోయింది- వాళ్లిద్దరికీ ఆరునెలలే వయస్సులో వార, అతను పేచీ పెట్టేడు కాని, పెద్దవాళ్ల గదమాయింపు, అప్పగారి కన్నీళ్లు, అన్నింటి కన్నా ముఖ్యంగా కాంతమ్మకు తండ్రి యిచ్చిపోయిన ఆస్తి పాస్తులు ఆతన్ని లొంగదీసినవి.

వివాహంతో శేషాచలం ఊహలన్నీ బాగానే వెనకబడ్డవి.

ఏ రంగంలో నయినా తదేక దీక్షాపరతంత్రుడయిన అతనిశక్తి సామర్థ్యాలవల్ల కాపరానికి వచ్చిన కొద్ది రోజులలోనే కాంతమ్మ ముగ్గురు బిడ్డల తల్లి అయింది; ముసిల్దీ అయింది.

స్వతహాగా కాంతమ్మ ఒత్తరి అయిన మనిషి. శేషాచలం సన్నని కాయవంటివాడు. అతనూ ఆవిడా, ఒకచోట నుంచుంటే చూసేవాళ్లు వీళ్లిద్దరూ భార్యాభర్తలా అప్పా తమ్ముళ్లా, అని అనుమానం పడేవాళ్లు. పైగా కాంతమ్మ పల్లెటూర్ది నోరు కాస్త జోరు. కాంతమ్మ ముందు శేషాచలం, గద్దరి తల్లికంటి యెరుపుకు భయభక్తులున్న పసివాడిలాగా గడగడలాడేవాడు.

జయాంతంగా యమ్. యస్. యమ్. పరిభ్రమణం పూర్తి చేసి ఉన్నత విద్యకు చెన్నపట్టణం చేరుకున్నాడు. సకుటుంబంగా నివసిస్తున్నాడు. భయభక్తులున్న భర్త!

బాగానేవుంది కొన్నాళ్లు.

సంసారభారంతో తాత్కాలికంగా తలవంచుకున్న అతని శృంగార పిపాస, బాధ్యతను చంపే పట్టణవాసంతో మళ్లీ తలయెత్తింది. క్లాసులో చేరిననాడే సరళాదేవికీ శేషాచలానికీ చూపుల్తో సంబంధం కుదిరింది. తరవాత చిన్న చిన్న నవ్వులూ, వరండాల్లో సంభాషణలూ ఒకరి పుస్తకాలు ఒకరు పుచ్చుకోటం, అప్పుడప్పుడు సినిమాలు, ఆఖరికి ఒకర్ని ఒకరు ఆతుక్కోవటం జరిగిపోయింది.

ఈ స్థితిలో యింటిపెగులు పుట్టి కాంతమ్మ రెండు నెలలు పుట్టింటికి వెళ్లటం తటస్థించింది. విశృంఖలుడై శేషాచలం చెలరేగేడు. అప్పుడప్పుడు సరళాదేవిని యింటికికూడా తీసుకు వెళ్లటం మొదలు బెట్టేడు.

కాంతమ్మ తిరిగివచ్చింది. అయినా వ్యవహారాలు కట్టుబడలేదు. అలవాటుబడ్డ ప్రాణాలు మరి!

ఆవేళ శేషాచలం యింట్లోలేదు. అలవాటు చొప్పున సరళాదేవి అతనియింటికి వచ్చింది. వస్తే యేముంది?

ఒకమూల నాలుగేళ్లపిల్ల తాటాకు బొమ్మలుపెట్టి తనతో తను మాట్లాడుకుంటూ ఆడుకుంటోంది. ఇంకోచోట రెండేళ్ల కుర్రాడు రబ్బరు బూరా జుంయిమని పాగిస్తూ

దిగంబరుడై చిందులు తొక్కుతున్నాడు. మరోచోట పదినెలల చంకపిల్లడు, మలమూత్ర సమ్మిశ్రమం చేసి పులివేషం వేసుకుంటూ రసాయన పరిశోధన చేస్తున్నాడు. సరళాదేవి కళ్ళార్ధినీ శరీరం అదృశ్యసందర్శనంతో గగుర్పొ



డిచింది. శేషాచలం ఇల్లు మార్చేడేమో ననుకుంది. ఇంతలో, కాళ్లకు చెప్పులూ, కళ్లకు జోడూ, చేతులో సంచీ యిత్యాదులతో వున్న యీ క్రొత్త స్వరూపాన్ని చూసి; వాళ్ల అమ్మ చెప్తూవుండే బూచి యిదే కామల్లనుకుని, ఆపిల్లలు ముగ్గురూ బావురు మన్నారు. ఆగోల విని వంటయింట్లో పనివిడిచి, ఊడిపోతున్న ముడితో, జారిపోయే పమిటతో, ఊరికే కానుపులు కంటంతో ఊచబారిన కాళ్లమీది కడియపు గొలుసుల ఖణఖణతో, రుసరుసలాడుతూ కాంతమ్మ బయటికి వచ్చింది. డాక్టరమ్మలాగా వున్న సరళాదేవిని చూసి, పమిట సర్దుకుని, వెనక్కి తగ్గి "ఏంకావాని మీవొచ్చారమ్మా?" అంది.

సరళాదేవి తెలుగుపిల్ల కాదు.

"శేషాచలంగారు యీ యింట్లో లేరా" అని ఇంగ్లీషులో అడిగింది. కాంతమ్మ హస్తచలనంతో యిప్పుడే యిల్లా వెళ్లేరనే అభిప్రాయం వెలిబుచ్చింది. ఆశాభంగంతో సరళాదేవి తిరిగి వెళ్లిపోయింది.

కాంతమ్మకు యేమీ అనుమానం కలుగలేదు. ఎవరో చదువుకున్న ఆవిడ వచ్చిందనుకుంది. భర్త యింటికి రాంగానే ఆపిల్ల వర్ణనయిచ్చి వచ్చి పోయిందని చెప్పి "ఎవరండీ ఆ అమ్మాయి?" అని అడిగింది. శేషాచలం తప్పుడు గుండెలు దడదడ లాడినయి. అయినా మొగవాడు గనక కాస్త తెప్పిరిల్లి, తడబడుతున్న నోటితోనే "ఆవిడ మా ప్రొఫెసరుగారమ్మాయి. మనింటికి అప్పుడప్పుడు పాఠాలు నేర్పుకొంటానికి వస్తూవుంటుంది. ఈతఫా వస్తే కాస్త మర్యాదచెయ్యి; బాగుండదు లేకపోతే" అని అప్పటికా గండం తప్పించుకున్నాడు.

కౌటల్యమెరగని గ్రామస్థుల బిడ్డ కాంతమ్మ. ఆసంగతే మురిసిపోయి ఊరుకుంది.

మర్నాడు, క్లాసయిపోయిం తరవాత, సరళాదేవి "ఎవరండీ మీయింట్లో ఆడవాళ్లూ పిల్లలూ ఉన్నారు" అని శేషాచలాన్ని అడిగింది. 'మాకుటుంబం' అని చెప్పటానికి అతనికి మొఖం చెల్లలేదు. "మా అక్కయ్యా పిల్లలూ మందు పుచ్చు కుంటానికి వచ్చారు. కొన్నాళ్లు యిక్కడ వుంటారు" అన్నాడు.

"అయితే నేను మీయింటికి రాగూడదా?" అంది సరళ. "రావచ్చు. కాని ఆవిడకు అనుమానం కలగకుండా యేవో పుస్తకాలు తెస్తూ ఏవో పుస్తకాలు పట్టుకుపోతూ వుండు, కొన్నాళ్లు మా పిల్లలకు కాసిని పిప్పరమింటు బిళ్లలూ అవీ యిస్తూవుండు. ఆవిడ సంతోషిస్తుంది." అన్నాడు.

సరళాదేవి "సరే" నంది.

సంబంధం కలిగిన ఆడదానికి సందేహాలూ సంకోచాలూ ఒక విధంగా కలగవు!

ప్రతి ఆదివారం సరళాదేవి శేషాచలం యింటికి వస్తూవుండేది. ఇంగ్లీషురాని కాంతమ్మకు వాళ్లు మాట్లాడుకుండే గోడవేమో అర్థమయ్యేది కాదు. అనుకూలంగావున్న ఆపరిస్థితిచూచి పెళ్లాలకు యింగ్లీషు రాకుండావుంటేనే ఒకవిధంగా మంచిదనుకున్నాడు శేషాచలం.

మనస్సులు కలసిన మొగవాడూ ఆడదీ ఎన్నాళ్లని కేవలం కబుర్లు చెప్పుకుంటూ వూరుకుంటారు? మొదట్లో యిద్దరూయెదురెదురుగా కూర్చుని ఎవళ్లూ చూడకుండా కన్నుగీటుకోటంతో తృప్తి పడేవాళ్లు. తరువాత తలుపు దగ్గరగావేసుకుని మాట్లాడుకోటం మొదలుపెట్టేరు. ఇంటి పనిలోమునిగి తేలే వెర్రిబాగుల కాంతమ్మకి సందేహమే పుట్టలేదు. "చదుకున్నవాళ్లందరూ యిట్లాగే చనువుగా ఉంటారు గామన్న" నుకుని ఊరుకుండేది.



అనురాగమనేది ఆరంభించకుండానే వుండాలిగాని ఆరంభించేక అది చస్తే మధ్యలో ఆగదు. కాంతమ్మ కల్పించుకోని కారణంతో శేషాచలం సంకోచ శృంఖలం సళ్లువిచ్చింది. ఆ మాటి కామాటు, అతని సాహసం విప్పారింది. చివరకు భార్య కన్నుబామి, తనకోరిక తీర్చుకోవట మెల్లాగా అని ఆలోచన మొదలు పెట్టేడు.

అంత చదువుచదివిన మొగవాడికి ఆలోచన తట్టదూ? మళ్లీ ఆదివారంనాటి ప్రొద్దున భోజనం చేస్తూ శేషాచలం పెళ్లాన్ని చూసి, "ఇవ్వాళ నాకు కజ్జికాయలు వండి పెట్టవ్" అని అడిగాడు. ఓకముసిలినవ్వు నవ్వి కాంతమ్మ "పాపం మరీ చిన్నపిల్లలయిపోతున్నారు" అంది.

"చిన్నవాణ్ణి కాదూ?" నవ్వుతూ అన్నాడు శేషాచలం.

"చిన్నవారు కాకేం ముగ్గురు బిడ్డలతండ్రులూ?" అంది కాంతమ్మ మూతి తిప్పుకుంటూ.

ముగ్గురు బిడ్డలతండ్రి! ఒకభార్యకు భర్త!! తనకడుపులో దురూహ!!! తలుచుకుంటే తన్నుచూస్తే తనకే అసహ్యం వేసింది శేషాచలానికి. కాని కామఝంఝానిలంలో ధర్మసంకోచతృణములు యెగిరిపోయినవి.

అయిదు గంటలు కావస్తూంది. భర్త అడిగేదని కజ్జికాయలు వండటానికి సర్వమూ సిద్ధముచేసి పొయ్యిదగ్గిర కూర్చుంది కాంతమ్మ.

సవిలాసంగా సరళాదేవి వచ్చింది. చంద్రసందర్శనంతో ఉన్మత్తుడులాగా ఆవిడనుచూచి ఉబ్బిపోయినాడు శేషాచలం. గదిలోకి తీసుకుపోయి కూర్చోబెట్టేడు ప్రేయురాలిని !

ఎంతకూ పిల్లలు అక్కడనుంచి కదలలేదు. పిప్పరమింటు బిళ్లలుతిన్నవిశ్వాసం ! చిరాకుతో శేషాచలం ప్రేమకు పిల్లలకన్నా మరి శత్రువులు లేరనుకున్నాడు. ఆలోచించి "అమ్మేదోవండుతూందర్రా" అన్నాడు. వాళ్లిద్దరూ వంటయింట్లోకి ఒక్కపరుగు పెట్టేరు.

తలుపువేసి, ప్రేమయజ్ఞానికి ముసిముసి నవ్వుతో గణేశపూజచేశాడు శేషాచలం. తన్మయత్వంలో తలుపుఘడియ వేయటం మరిచి పోయినాడు !

తనపనికి కడ్డంవచ్చిన పిల్లల్ని "మళ్లీవచ్చారా ? మీ దుంపతెగా ! నాన్నదగ్గిరకుపోండి" అని ఒక్క కసురు కసిరింది కాంతమ్మ. హడిలిపోయి వాళ్లు మళ్లీతిరిగివచ్చారు.

గది వేసివుంది.

ఆ ఆడపిల్ల కాలాంతకురాలు ? తలుపులోయ్యాకుండా సందులోనుంచి తొంగిచూసింది !

లోపల తండ్రి సరళాదేవిని ఊరికే ముద్దుపెట్టుకుంటున్నాడు. అదిచూసి మళ్లీ వెంటనే తల్లిదగ్గరకు పరిగెత్తింది.

"అమ్మోయ్ ! అమ్మోయ్ !..."

"ఏమమ్మా ! నీయమ్మ అర్ధాన్నమయిపోను !"

"మరీ ! మరీ ! నాన్నే ఆ అమ్మాయినే..."

కాంతమ్మకు సర్వమూకళ్లకు కట్టినట్లయింది మ. స్సులో అజ్ఞాతవాసం చేస్తున్న అనుమానం ఒక్కమాటుగా విజృంభించింది. మెల్లిగా గది తలుపుదగ్గరకువచ్చి చూసింది.

ఆదృశ్యం చూస్తే ఏ ఆడదానికి వళ్లు భగ్గుమండదు ? పైగా అప్పటికి యింకో డిగ్రీ హెచ్చింది. తనభర్తా అదీ మంచంమ్మీద పడుక్కుని...

దుఃఖాగ్రహాల్లో ఆ పాదమస్తకం గజగజానికి పోయింది కాంతమ్మకు.

ఆవిడకోపం భర్తమీదకాదు. "మొగవాళ్లెప్పుడూ ఒళ్లూపై తెలియని మూర్ఖులే ! పిల్లలతల్లి మొగుడని-అయినయింటి ఆడముండ ; దానికెందుకు బుద్ధిలేకపోవాలి ? " ఇదీ ఆ హిందూపత్ని ఆలోచన !

రివరివా వంటయింట్లోకివెళ్లింది. చీపురుకట్ట తిప్పి చేతులో ఊతంగాపట్టుకుంది. గబగబా గదిదగ్గిరకువెళ్లి ఒక్క తోపు తోసింది. వాళ్లు లేవటానికయినా అవకాశంలేదు.

"తప్పుడుముండా ! దగల్బాజీముండా !! రండముండా ! నాకాపరంలో నిప్పులుబోస్తావా ? నామొగుణ్ణి వల్లో వేసుకున్నావా ? మళ్లీ రావుగద ! మళ్లీరావుగద !..."

ఫెడీ ; ఫెడీ ! ఫెడీ, ఫెడీ !; కొట్టింది.

ఆజన్మసంస్కారంతో నవనవలాడే సరళాదేవి వీపు పెట్లిపోయింది.

తొలిగినబట్ట సరిచేసుకుని తిరిగి చూడకుండా పరిగెత్తింది.

బల్లమీద కాగితపు పువ్వులు పకపకానవ్వినవి ! యెందుకో ?



భృంగామలకతైలము

1 ఔన్సు మాదిరి బుడ్డి 2½ అణాలు.

6 ఔన్సు బుడ్డి 12 అణాలు.

నంజనగూడు పండ్లపొడి

8 అ. 6 ప్యాకెట్టు. తపాలాచార్జి ఉచితము

హోల్‌సేల్ ఏజెంట్లు: యునైటెడ్ కమ్మరన్, బందరువీధి, మద్రాసు. కాకినాడ, సూర్యారావుపేట, లక్ష్మీనారాయణకంపెనీ, రాజమండ్రి, అరవరామస్వామి అండ్ సన్సు, బందరు, ఆనందాఫార్మసీయందును దొరుకును.